https://teluguislam.net



# ఉహద్ పోరాటం తరువాతి సైనిక చర్యలు

ఉహద్ యుద్ధంలో అపజయానికి గురియైన తరువాత ముస్లిములకు ఇప్పటి వరకు లభించిన ఖ్యాతి కాస్తా మట్టిలో కలిసిపోయింది. విరోధుల హృదయాల్లో వారి ఎడల ఉన్న భయభీతులు తొలగిపోయి పులులైపోయారు. దీని ఫలితంగా, విశ్వాసులపై ఇటు మదీనాలోనూ, అటు మదీనాకు వెలుపల నుండి వచ్చిపడే కష్టాలు అధికమైపోయాయి. మదీనా నలువైపుల నుండి ప్రమాదాలు పొంచి చూస్తున్నాయి. యూదులు, వంచకులు మరియు బుద్దూలు బాహాటంగా వారి శత్రుత్వాన్ని బహిర్గతం చేయనారంభించారు. ప్రతి వర్గం ముస్లిములకు నష్టం కలిగించే ప్రయత్నంలో నిమగ్నమైపోయింది. ఇంకా చెప్పాలంటే, ఇప్పుడు ముస్లిములను అంతమొందించడం తేలిక అనీ, వారిని నామరూపాల్లేకుండా చేయవచ్చునే ధైర్యం కూడా వారికి కలిగింది. కాబట్టి ఉహద్ పోరాటం జరిగి రెండు నెలలు గడిచాయో లేదో 'బనూ అసద్' తెగ మదీనాపై దాడి చేయడానికి సంసిద్ధమైంది. సఫర్ నెల హిజ్రీ శకం 4లో అజ్ల్ మరియు ఖారా అనే రెండు తెగలు పన్నిన కుట్ర మూలంగా పదుగురు సహాబా (ర)లు అమరగతిని పొందవలసి వచ్చింది. అదే నెలలో బనూ ఆమిర్ అనే ధనవంతుడు అలాంటిదే మరో ద్రోహం తలపెట్టడం వలన డెబ్భయి మంది సహాబా (ర)లు అమరగతి పొందారు. ఈ సంఘటన 'బీరె మఊనా' పేరుతో ప్రఖ్యాతిగాంచింది. ఈ తరుణంలోనే బనూ నజీర్ తెగ కూడా బాహాటంగా ముస్లిములకు వ్యతిరేకంగా కక్ష సాధించడానికి సిద్ధపడింది. ఆ తెగ, రబీఉల్ అవ్వల్ నెల, హిజ్రీ శకం 4లో స్వయంగా మహాప్రవక్త (స)నే హతమార్చే ప్రయత్నం చేసింది. ఇటు బనీ గత్ఫాన్ తెగ ధైర్యం పెచ్చుపెరిగి జమాదిల్ ఊలా మాసం (హి.శ. 4)లో మదీనాపై దాడి చేసే పథకాన్ని కూడా సిద్ధం చేసుకుంది.

మొత్తానికి ఉహద్ యుద్ధంలో మట్టిపాలైన ముస్లిముల గౌరవం ఫలితంగా వారు ఓ కొంత కాలం మట్టుకు ప్రమాదాల వలలో చిక్కుకుపోయా

https://teluguislam.net



రన్నది వాస్తవం. అయితే, ఈ తరుణంలో మహాప్రవక్త (స) అనుసరించిన యుద్ధనీతి, చతురత, వివేచనలు ఆ ప్రమాదాలన్నిటిని తప్పించి ముస్లిములకు వారి పూర్వ గౌరవోన్నతులను తెచ్చిపెట్టగలిగాయి. తిరిగి వారికి పూర్వ వైభవం కట్టబెట్టాయి. ఈ విషయంలో మహాప్రవక్త (స) 'హమ్రా ఉల్ అసద్' వరకు బహుదైవారాధకులను వెంటాడిన తీరు మొదటిది. ఈ చర్య మూలంగా ఆయన సేన గౌరవం చాలా మటుకు నిలబడగలిగింది. ఎందుకంటే ఈ చర్య ఎంతో ధైర్యసాహసాలతో కూడిన యుద్ధవ్యూహానికి సంబంధించిన చర్య. ముఖ్యంగా దైవప్రవక్త (స)ను విరోధించే వారు ముఖ్యంగా 'మునాఫిక్‌లు మరియు యూదులు' ఆశ్చర్యంతో నోళ్ళు వెళ్ళబెట్టారు. ఆ తరువాత ఆయన ఎడతెగకుండా నడిపిన సైనిక చర్యల్లో ముస్లిముల పూర్వ ప్రాభవం తిరిగి రావడమే కాకుండా ఆ ప్రాభవం మరింత పెరిగిపోయింది కూడా. ముందు పుటల్లో ఆ విషయాల గురించే చెప్పడం జరుగుతోంది.

## 1. సరియ్యా అబీ సల్మా

ఉహద్ పోరాటం తరువాత ముస్లిములకు వ్యతిరేకంగా మొట్టమొదట బనూ అసద్ బిన్ ఖజీమా తెగ సమాయత్తమైంది. ఖువైలీద్ ఇద్దరు కుమారులు తల్హా మరియు సల్మాలు కలసి తమ జాతిని, విధేయుల్ని వెంటబెట్టుకుని బనూ అసద్ తెగను దైవప్రవక్త (స)పై దాడి చేయడానికి పురికొల్పుతున్నారనే వార్త మదీనాకు చేరింది. వెంటనే మహాప్రవక్త (స) నూటయాభై మంది అన్సారులు మరియు ముహాజిర్లతో కూడిన ఓ సైనిక పటాలాన్ని సిద్ధపరిచారు. హజ్రత్ అబూ సల్మా (ర)కు ఆ సైనిక పటాలం జెండానిచ్చి ఆయనను ఆ పటాలం కమాండరుగా నియమించి పంపారు. హజ్రత్ అబూ సల్మా (ర), బనూ అసద్ బయలుదేరక మునుపే వారిపై విరుచుకుబడ్డారు. ఈ హఠాత్పరిణామానికి ఏమీ పాలుపోక వారు చెరో దిక్కు పారిపోయారు. ముస్లిములు వారి ఒంటెల్ని, మేకల్ని స్వాధీనపరచుకొని మదీనాకు తిరిగి వచ్చారు. వారిని ఎదుర్కొని యుద్ధం చేసే అవసరమే ఏర్పడలేదు.

ఈ సరియ్యా, ముహర్రం నెల, హిజ్రీ శకం 4న నెలపొడుపు రోజున పంపించడం జరిగింది. తిరిగివచ్చిన తరువాత హజ్రత్ సల్మా(ర)కు ఉహద్ యుద్ధంలో అయిన గాయం వల్ల మరణం సంభవించింది.[1]

1. జాదుల్ ముఆద్-2/108

https://teluguislam.net



## 2. అబ్దుల్లా బిన్ ఉనీస్ (ర) గారు జరిపిన సైనిక చర్య

అదే నెల ముహర్రం 5వ తారీఖున (హి.శ. 4) ఖాలిద్ బిన్ సుఫ్యాన్ హుద్‌లీ అనేవాడు ముస్లిములపై దాడి చేయడానికి సైన్యాన్ని సమీకరిస్తున్నాడన్న వార్త అందింది. మహాప్రవక్త (స) అతని పీచమణచడానికిగాను హజ్రత్ అబ్దుల్లా బిన్ ఉనీస్ (ర)ను పంపారు.

హజ్రత్ అబ్దుల్లా బిన్ ఉనీస్ (ర) పద్దెనిమిది రోజుల తరువాత తిరిగి వచ్చారు. ఆయన ఖాలిద్‌ను చంపి అతని తలను కూడా వెంటతెచ్చారు. మదీనా చేరి ఆయన దైవప్రవక్త (స) ముందు ఆ తలను పడవేయగా ఆయన (స) ఆయనకు ఓ చేతికర్రను బహూకరిస్తూ, ఇది నాకు నీకు నడుమ ప్రళయం రోజున గుర్తుగా ఉంటుంది అన్నారు. ఆయన మరణించేటప్పుడు ఈ చేతి కర్రను నా కఫన్‌లో చుట్టి దాన్ని కూడా ఖననం చేయమని మరణ శాసనం చేశారు.[2]

## 3. రజీ సంఘటన

ఆ సంవత్సరమే (హి.శ. 4) సఫర్ నెలలో దైవప్రవక్త (స) వద్దకు అజ్ల్ మరియు ఖారా తెగలకు చెందిన కొంత మంది వచ్చి, వారి తెగలో ఇస్లాం ధర్మం గురించి బాగా ప్రచారం జరుగుతోందని, తమరు ధర్మబోధ కోసం, ఖుర్ఆన్ చదివించడానికి కొంతమందిని పంపాలని కోరారు. మహాప్రవక్త (స), ఇబ్నె ఇస్‌హాక్ కథనం ప్రకారం, ఆరుగురిని మరియు సహీ బుఖారి ఉల్లేఖనం ప్రకారం, పది మందిని వారి వెంట పంపించారు. ఇబ్నె ఇస్‌హాక్ చెప్పినట్లు, ముర్సిద్ బిన్ అబీ ముర్సిద్ గనవీకు, సహీ బుఖారి ఉల్లేఖనం ప్రకారం, ఆసిమ్ బిన్ ఉమర్ బిన్ ఖత్తాబ్ తాతగారైన హజ్రత్ ఆసిమ్ బిన్ సాబిత్ (ర)ను ఆ బృందానికి అమీరుగా (నాయకునిగా) చేసి పంపించినట్లు చెప్పబడుతోంది. వీరంతా రాబెగ్ మరియు జిద్దా నడుమన గల హుజైల్ తెగకు చెందిన 'రజీ' అనే చెలమకు చేరగానే, అజ్ల్ మరియు ఖారాకు చెందిన వారు హుజైల్ తెగ వారిని వారిపై పురికొల్పి వెన్నంటి చంపమని పంపించారు. బనూ లహియ్యాన్‌కు చెందిన ఓ వంద మంది విలుకాండ్రు ఆ బృందం

2. జాదుల్ ముఆద్-2/109; ఇబ్నె హష్షామ్-2/619, 620

https://teluguislam.net



వెంటబడ్డారు. వారి అడుగుజాడల్ని చూస్తూ ఆ బృందాన్ని చేరుకోవడం జరిగింది. ఇది గమనించిన సహాబా (ర) ఓ ఎత్తయిన కొండపైకెక్కి రక్షణ పొందారు.

బనూ లహియ్యాన్ విలుకాండ్రు వారిని చుట్టుముట్టి, మీరు దిగివస్తే మిమ్మల్ని చంపము అని మాటిస్తున్నాం అన్నారు. హజ్రత్ ఆసిమ్ (ర) దిగడానికి సిద్ధపడక తమ మిత్రులతో యుద్ధానికి దిగారు. చివరికి బాణాల వర్షం కురిపించి ఏడుగురిని చంపడం జరిగింది. ఇక హజ్రత్ ఖుబైబ్(ర), జైద్ బిన్ దస్నా (ర), మరో సహాబీ (ర) ముగ్గురూ మిగిలిపోయారు. ఇప్పుడు కూడా బనూ లహియ్యాన్ తన వాగ్దానాన్ని వారి ముందుంచడం వలన ఆ ముగ్గురు క్రిందికి దిగివచ్చారు. అయితే వారు క్రిందికి రాగానే తమ మాటపై నిలబడక వారిని తమ వింటి నారులతో కట్టివేస్తుండగా, అందు మూడో సహాబీ (ర), ఇది మీరు చేసిన వాగ్దానానికి విరుద్ధమైన విషయం అంటూ వారి వెంట వెళ్ళడానికి నిరాకరించారు. వారు ఆయన్ను ఈడ్చుకొని తమ వెంట తీసుకు వెళ్ళే ప్రయత్నం చేయగా ఆయన నిరాకరించడం వల్ల అక్కడనే చంపేశారు. హజ్రత్ ఖుబైబ్ మరియు హజ్రత్ జైద్ (ర)లను మక్కాకు తీసుకొని వెళ్ళి అమ్మేశారు. ఈ ఇద్దరు సహాబా (ర)లు బద్ర్ యుద్ధంలో మక్కా సర్దారులను మట్టుపెట్టినవారు.

హజ్రత్ ఖుబైబ్ (ర) కొంతకాలం మక్కా వారి ఖైదులోనే ఉన్నారు. ఆ తరువాత ఆయన్ను హత్య చేద్దామనే ఉద్దేశ్యంతో హరం (బైతుల్లాహ్) బయట ఉన్న 'తన్ఈమ్' అనే ప్రదేశానికి తీసుకొని రావడం జరిగింది. ఆయన్ను ఉరికంబం ఎక్కించడానికి సిద్ధమైనప్పుడు ఆయన వారితో, "నన్ను వదలండి, నేను రెండు రకాతుల నమాజు చేసుకుంటాను" అన్నారు. బహుదైవారాధకులు ఆయన ఈ చివరి కోరికను మన్నించి కట్లు విప్పారు. ఆయన రెండు రకాతుల నమాజు చేశారు. నమాజు ముగించుకొని సలాము పూర్తి చేసిన తరువాత ఆయన వారినుద్దేశించి, "నేను భయం వల్ల ఇలా చేస్తున్నానని అనుకుంటారని నమాజును త్వరగా ముగించాను. అలా కాని పక్షంలో నా నమాజును ఇంకొంత పొడిగించేవాణ్ణి అంటూ, ఓ అల్లాహ్! వీరిని ఒక్కొక్కరిగా లెక్కించు, పిదప వారిని విడదీసి చంపు, వీరిలో మరెవ్వరినీ వదలిపెట్టకు" అని ప్రార్థించారు. ఆ తరువాత ఈ క్రింది అర్థం వచ్చే పద్యపాదాలను పఠించారు.

https://teluguislam.net



"ప్రజలు నా చుట్టు గుంపులు గుంపులుగా ప్రోగయ్యారు. తమ తెగల్ని నాపైకి ఉసిగొల్పారు. ఇలా ఓ పెద్ద సమూహాన్ని కూడదీశారు. తమ కుమారుల్ని, తమ స్త్రీలను కూడా పిలుచుకున్నారు. నన్ను ఓ దృఢమైన ఎత్తయిన బోదె దగ్గరకు చేర్చారు. నేను నా దీన స్థితి, స్వస్థలం నుండి నా ఎడబాటు, నా వధ్యస్థలం దగ్గర ప్రోగైన బృందాలు పెట్టే బాధలను గురించి అల్లాహ్‌కే ఫిరియాదు చేస్తున్నాను. ఓ ఆకాశాల స్వామీ! నా ఎడల నా శత్రువులు అవలంబిస్తున్న ఈ వైఖరిపై నాకు సహనం వహించే భాగ్యం కలుగజెయ్యి. వారు నన్ను ముక్కలుముక్కలుగా నరికేస్తారు. వారు నన్ను, నిన్ను ధిక్కరించమని ఒత్తిడి చేస్తున్నారు. అయినా మరణమే అంతకంటే సులభతరమైనది. నా కళ్ళు కన్నీళ్ళు లేకుండా బయటకు రావాలి. నేను చంపబడితే, ఏ ప్రక్కన పడిపోయి చస్తానో అనే బెంగ నాకు లేదు. నా ఈ మరణం దైవమార్గంలో వచ్చే మరణం. ఖండఖండాలుగా నరికిన నా అవయవాల్లో ఆయన శుభాన్ని కలుగజేస్తాడు."

ఆ తరువాత అబూ సుఫ్‌యాన్, హజ్రత్ ఖుబైబ్(ర)తో, "ముహమ్మదే గనుక (నీకు బదులు) మా దగ్గర ఉండి ఉంటే, మేము ఆయన మెడను నరికేస్తే, నీవు నీ భార్యాబిడ్డలతో సుఖంగా ఉంటే ఇది నీకు ఇష్టమేనా?" అని అడిగాడు. ఇది విన్న హజ్రత్ ఖుబైబ్ (ర), "దైవసాక్షి! దాన్ని నేను ఎన్నటికీ సహించజాలను. ఆయనే తన భార్యాబిడ్డలతో సుఖంగా ఉంటూ ఆయన కాలిలో ఓ ముల్లు గ్రుచ్చుకొని అది ఆయనకు బాధ కలిగించినా నేను సహించే విషయం కాదు" అని బదులు పలికారు.

పిదప ఆయనను ముష్రిక్కులు ఉరివేసి శవాన్ని వ్రేళ్ళాడదీశారు. దాని రక్షణ కోసం మనుషుల్ని నియమించారు. కాని హజ్రత్ అమ్రూ బిన్ ఉమయ్యా (ర) అక్కడికి వచ్చి వారిని మోసగించి శవాన్ని రాత్రికి రాత్రే మాయం చేశారు. దాన్ని ఖననం చేశారు. హజ్రత్ ఖుబైబ్(ర)ను చంపినవాడు ఉక్బా బిన్ హారిస్. హజ్రత్ ఖుబైబ్ (ర) అతని తండ్రి హారిస్‌ను బద్ర్ యుద్ధంలో సంహరించారు.

సహీ బుఖారీలో ఉల్లేఖించిన దాని ప్రకారం, హత్య సమయంలో రెండు రకాతుల నమాజు చేసే సంప్రదాయాన్ని ప్రవేశపెట్టినవారు హజ్రత్ ఖుబైబ్ (ర) మాత్రమే అని ఉంది. ఆయన్ను చంపే ముందు ఖైదు చేయగా ఆయన దగ్గర ద్రాక్ష గుత్తులు కొన్ని కనుగొనడం జరిగింది. ఆయన అప్పుడు వాటిని తింటున్నారు. మక్కాలో ఖర్జూరం కూడా లభించని రోజులవి.

https://teluguislam.net



ఈ సంఘటనలో బందీ అయిన మరో సహాబీ (ర) అంటే హజ్రత్ జైద్ బిన్ దస్నా (ర)ను సఫ్వాన్ బిన్ ఉమయ్యా కొని తన తండ్రి హత్యకు బదులు చంపేశాడు.

ఆ సహాబాల బృందానికి నాయకునిగా ఉన్న ఆసిమ్ బిన్ సాబిత్ (ర) అల్లాహ్‌ను వేడుకొని ఉన్నారు, తన శరీరంలోని ఏ భాగాన్నీ ముష్రిక్కులు తాకకూడదని, తానూ ఏ ముష్రిక్కునూ అంటుకోనని. ఆయన బద్ర్ యుద్ధంలో ఖురైషులకు చెందిన ఓ ముష్రిక్కును సంహరించి ఉన్నారు. అందుకని ఖురైషులు ఆయన శవానికి చెందిన ఓ ఖండాన్నైనా తీసుకురమ్మని మనుషుల్ని పంపించారు. కాని అల్లాహ్ ఆయన వేడుకోలును మన్నించి ఆయన శవాన్ని కాపాడడానికి కందిరీగల ఓ పెద్ద తుట్టెను పంపించాడు. ముష్రిక్కులు ఆయన శవం వద్దకు పోలేక వెనక్కు మరలి వచ్చేశారు. హజ్రత్ ఉమర్ (ర) గారికి ఈ సంఘటన గురించి తెలిసినప్పుడు ఆయన తరచూ ఇలా అంటూ ఉండేవారు.

"అల్లాహ్ విశ్వాసిని అతను జీవించి ఉన్నప్పటివలెనే మరణించిన తరువాత కూడా రక్షిస్తూ ఉంటాడు."[3]

## 4. 'బిఇరెమఊనా' ఉదంతం

రజీ సంఘటన జరిగిన మాసంలోనే బిఇరెమఊనా ఉదంతం కూడా చోటు చేసుకుంది. ఇది రజీ సంఘటనకంటే ఘోరమైనది.

ఈ ఉదంతం వివరాలు ఇలా ఉన్నాయి:

'మసాయిబుల్ అస్నా' (శూలాలతో ఆటలాడుకునేవాడు) బిరుదు గల 'అబూ బరా ఆమిర్ బిన్ మాలిక్' అనేవాడు మదీనాపురంలో మహాప్రవక్త (స) సన్నిధికి హాజరయ్యాడు. అతన్ని దైవప్రవక్త (స) ఇస్లామ్ ధర్మం వైపునకు ఆహ్వానించారు. అతను ఇస్లామ్ ధర్మాన్నయితే స్వీకరించలేదుగాని, ముస్లిములకు విరోధిగా కూడా ఉండలేదు. అతను దైవప్రవక్త (స)తో, "దైవప్రవక్తా! తమరేగనక మీ అనుచరుల్లో కొందరిని నజర్‌కు పంపిస్తే, వారు ఇస్లామ్

---

3. ఇబ్నె హిషామ్-2/169-179; జాదుల్ ముఆద్-2/109; సహీ బుఖారి-2/568, 569, 585

https://teluguislam.net



ధర్మాన్ని స్వీకరిస్తారని ఆశగా ఉంది" అన్నాడు. దానికి మహాప్రవక్త (స), ఇబ్నె ఇస్‌హాక్ కథనం ప్రకారం, నలభై మందిని, సహీ బుఖారి ఉల్లేఖనం ప్రకారం, డెభ్భయి మందిని అతని వెంట పంపించారు- డెభ్భయి మందిని పంపించారనే ఉల్లేఖనం సరైనది- సాయిదా తెగకు చెందిన మున్జిర్ బిన్ అమ్రూ (ర)ను ఆ బృందానికి అమీరుగా చేసి పంపించారు. ఈ బృందంలో ఉన్న సహాబాలంతా మేధావులు, ఖుర్‌ఆన్ పారాయణంలో దిట్టలు, సహాబాల్లోకెల్లా ఉత్తమమైన వారు. వీరు పగలు కట్టెలు కొట్టి వాటిని అమ్మి 'సుఫ్ఫా' వారి కోసం భోజనం సమకూర్చిపెట్టేవారు. వారికి ఖుర్‌ఆన్ చదివించేవారు. రాత్రి పూట మహాప్రవక్త (స) గారితోపాటు నమాజులోనూ, వేడుకోళ్ళలోనూ నిమగ్నమై ఉండేవారు. ఈ బృందం ప్రయాణిస్తూ మఊనా బావి వద్దకు చేరుకున్నారు. ఈ బావి బనూ ఆమిర్ మరియు హుర్రా బనీ సులైమ్ తెగలు నివసించే ప్రదేశానికి నడుమన గల ఓ ప్రదేశంలో ఉంది. అక్కడ విడిది చేసిన తరువాత సహాబా (ర), ఉమ్మె సులైమ్ సోదరుడు హిరామ్ బిన్ మల్హాన్‌కు దైవప్రవక్త (స)గారి లేఖనిచ్చి, దైవ విరోధి అయిన ఆమిర్ బిన్ తుఫైల్ వద్దకు పంపించారు. కాని అతను ఆ ఉత్తరాన్ని చూడనైనా చూడలేదు. ఓ మనిషికి సైగ చేశాడు; ఆ మనిషి హజ్రత్ హిరామ్ (ర) వీపులో శూలాన్ని దిగగొట్టాడు. అది ఆయన శరీరంలో నుంచి బయటకు వచ్చేసింది. రక్తాన్ని చూడగానే హజ్రత్ హిరామ్ (ర)గారి నోట, "అల్లాహు అక్బర్! కాబా ప్రభువు సాక్షి! నేను విజేతనయ్యాను" అనే పలుకులు వెలువడ్డాయి.

వెంటనే దైవ విరోధి అయిన ఆమిర్, మిగిలిన సహాబా(ర)లపై విరుచుకుపడమని తన తెగ బనీ ఆమిర్‌ను ఉసికొల్పాడు. కాని వారు బరా సంరక్షణలో ఉండడం వలన అతని మాటలను లెక్కచెయ్యలేదు. చేసేదిలేక అతను బనూ సులైమ్‌ను కేకవేశాడు. బనూ సులైమ్‌కు చెందిన మూడు తెగలు'అసియా, రఅల్, జకాన్'లు అతని పిలుపునకు పరుగెత్తుకొచ్చారు. రాగానే వారు ఆ సహాబా (ర)లను చుట్టుముట్టేశారు. సమాధానంగా సహాబాలు కూడా తమ ఆత్మరక్షణ కోసం పోరాడవలసి వచ్చింది. అయినా అందరూ అమరగతి పొందారు. ఒక్క హజ్రత్ కఅబ్ బిన్ జైద్ బిన్ నజ్జార్ (ర) మాత్రం బ్రతికిపోయారు. గాయాలతో పడివున్న ఆయన్ను షహీదుల నడుమ నుండి ఎత్తుకు రావడం జరిగింది. అగడ్త యుద్ధం వరకు ఆయన జీవించే ఉన్నారు. ఆయనే కాకుండా మరిద్దరు సహాబా (ర)లు హజ్రత్ అమ్రూ బిన్ ఉమయ్యా

https://teluguislam.net



జమరీ (ర) మరియు హజ్రత్ మున్జిర్ బిన్ ఉఖబా బిన్ ఆమిర్ (ర)లు ఒంటెలను మేపడానికి వెళ్ళడం వలన మిగిలిపోయారు. వారు ఆ పోరాటం జరిగిన చోట గ్రద్దలు ఎగరడం చూసి నేరుగా అక్కడికి వెళ్ళి చూడగా వారి సహచరులు ముష్రిక్కులతో యుద్ధం చేస్తూ చనిపోయారన్న విషయం తెలిసింది. అక్కడ హజ్రత్ అమ్రూ బిన్ ఉమయ్యా జమరీని బందీగా పట్టు కోవడం జరిగింది. ఆయన తాను ముజిర్ తెగకు చెందిన వాడని పరిచయం చేసుకోగా, ఆమిర్, ఆయన నొసటి వెంట్రుకలను కత్తిరించి తన తల్లి తరఫున స్వతంత్రునిగా చేసి వదిలేశాడు. అతని తల్లి ఇదివరకే ఓ బానిసను విడిచి పెడ్తానని మ్రొక్కుకొని ఉంది.

హజ్రత్ అమ్రూ బిన్ ఉమయ్యా జమ్రీ (ర) ఈ దుర్ఘటనను మదీనాకు చేరవేయడానికి బయలుదేరారు. డెభ్భయి మంది ముస్లిముల అమరగతి, ఉహద్ యుద్ధ గాయాన్ని తిరిగి తోడేసింది. ఉహద్ యుద్ధంలో చనిపోయిన వారు బాహాబాహి యుద్ధంలో ప్రాణాలు పోగొట్టుకున్నవారు. కాని పాపం వీరు మాత్రం ఓ హేయమైన మోసం, దగా మరియు కుట్ర కారణంగా చనిపోయారు.

హజ్రత్ అమ్రూ బిన్ ఉమయ్యా జమ్రీ (ర) తిరుగు ప్రయాణంలో ఖనాత్ లోయ చివర్లో ఉన్న 'ఖర్‌ఖరా' అనే ప్రదేశానికి చేరి ఓ చెట్టు నీడన సేద తీర్చుకుంటున్నారు. అక్కడే బనూ కిలాబ్ తెగకు చెందిన ఇద్దరు వ్యక్తులు కూడా వచ్చి చేరారు. వారిద్దరు ఆదమరిచి నిద్రించే సమయంలో హజ్రత్ అమ్రూ (ర) వారిద్దరిని చంపేశారు. అలా చేయడం ఆయన దృష్టిలో, తమ స్నేహితుల హత్యకు పగ తీర్చుకుంటున్నానని అనుకోవడమే. అయితే, ఆ ఇద్దరికి మహాప్రవక్త (స) గారు సంరక్షణ హామీ ఇచ్చి ఉన్నారన్న విషయం ఆయనకు తెలియదు. మదీనాకు వచ్చి ఈ విషయం గురించి చెప్పగా, ఆయన(స), "అయ్యో! నీవు నా రక్షణ పొందిన ఇద్దరిని చంపేశావు. వారి దీత్ (రక్తపరిహారం) నేను తప్పకుండా చెల్లించాల్సి ఉంది" అని అన్నారు. ఆ తరువాత మహాప్రవక్త (స) వారి మిత్రపక్షాలైన యూదుల నుండి ఆ దీత్‌ను కూడగట్టడంలో నిమగ్నమైపోయారు.[4] ఆ తరువాతే ఈ సంఘటన గజ్వాయె బనూ నసీర్‌కు కారణభూతమైంది.

---

4. *చూడండి, ఇబ్నె హష్షామ్-2/183-188; జాదుల్ ముఆద్-2/109,110; సహీ బుఖారి-2/584, 586*

https://teluguislam.net



మఊనా మరియు రజీ దుర్ఘటనలు ఒకదాని తరువాత మరొకటి ఉనికిలోనికి రావడం మూలంగా[5] దైవప్రవక్త (స) ఎనలేని దుఃఖానికి లోన య్యారు.[6] ఏ జాతులు, మరే తెగలైతే ఈ సహాబా (ర)ల పట్ల ఈ విధంగా ప్రవర్తించాయో, మహాప్రవక్త (స) ఒక నెల వరకు వారిని శపిస్తూనే ఉన్నారు. సహీ బుఖారిలో హజ్రత్ అనస్ (ర) గారి ఉల్లేఖనం ప్రకారం, ఆయన (స) ముప్ఫై రోజుల వరకు ఆ షహీదులను చంపిన వారిని శపించారని, ఆయన (స) ఫజ్ర్ నమాజులో రఅల్, జక్వాన్, లహియ్యాన్ మరియు ఉసయ్యాను శపించేవారు. అల్లాహ్ ఈ విషయంలో దైవప్రవక్త (స)పై దైవవాణిని అవతరింపజేశాడు. అది ఆ తరువాత రద్దు అయింది. ఆ దైవవాణిలో ఇలా ఉంది.

"మా జాతికి చెప్పండి, మేము మా ప్రభువును కలుసుకున్నామని, ఆయన మా ఎడల సంతుష్టుడయ్యాడని, మేము ఆయన పట్ల సంతుష్ట లయ్యాము." ఆ తరువాత దైవప్రవక్త (స) తన ఈ శాపాన్ని వదిలేశారు.[7]

## 5. గజ్వయె బనూ నజీర్

యూదులకు ఇస్లామ్ అన్నా, ముస్లిములు అన్నా గిట్టేది కాదన్న విషయం, వారు రణధీరులు కాకపోవడం వలన కుట్రలు, కుతంత్రాల మాధ్యమంగానే తమ పబ్బం గడుపుకుంటూ, ఇస్లామ్‌కు వ్యతిరేకంగా రంగం సిద్ధం చేసి దాన్ని సర్వనాశనం చేసే ప్రయత్నాలు చేస్తున్నారనే విషయం మనం ఇదివరకు చెప్పుకున్నదే. ముస్లిములతో చేసుకున్న ఒప్పందాన్ని తుంగలో తొక్కి వారిని సకల విధాల బాధలకు గురిచేయడం వారి అలవాటుగా మారిపోయింది. అయితే బనీ ఖైనుఖా దేశ బహిష్కరణ మరియు కఅబ్ బిన్ అష్రఫ్ హత్యతో వారి ధైర్యం కాస్తా సన్నగిల్లిపోయింది. వారు భయభీతులై మిన్నకుండిపోవలసివచ్చింది. కాని ఉహద్ యుద్ధం తరువాత వారికి ధైర్యం తిరిగివచ్చినట్లయింది. వారు బాహాటంగా

5. వాఖిదీ, రజీ మరియు మఊనా దురంతాల వార్త దైవప్రవక్త (స)కు ఒకే రాత్రి చేరినట్లు చెప్పారు.
6. ఇబ్నె సఅద్ (ర), హజ్రత్ అనస్ (ర)గారి ఉల్లేఖనాన్ని ఉల్లేఖిస్తూ, బిఇరె మఊనా సంఘటనపై దుఃఖించినంతగా మరే సంఘటనపై ఆయన దుఃఖించలేదు అని అంటారు. చూడండి, ముఖ్తసరుస్సీరత్- అబ్దుల్లాహ్-పుట.260
7. సహీ బుఖారి-2/586, 587, 588

https://teluguislam.net



ముస్లిములతో చేసుకున్న ఒప్పందాన్ని ఉల్లంఘించారు. వారు మదీనాలోని వంచకులతోనూ, మక్కాలోని ముష్రిక్కులతోనూ తిరిగి రహస్య సంబంధాలు ఏర్పర్చుకున్నారు. ముస్లిములకు వ్యతిరేకంగా ముష్రిక్కులకు చేయూతనివ్వసాగారు.[8]

దైవప్రవక్త (స)కు ఇదంతా తెలిసినప్పటికీ సహనం వహించేవారు. కాని రజీ మరియు మఊనా దుర్ఘటనల తరువాత వారి ధైర్యం, తెగింపు హద్దులు మీరాయి. వారు మహాప్రవక్త (స)ను అంతమొందించే పథకాన్ని సిద్ధం చేశారు. ఆ పథకం వివరాలు ఇలా ఉన్నాయి.

దైవప్రవక్త (స), తమ సహచరులు కొందరితో యూదుల దగ్గరకు వెళ్ళారు. వారి నుండి బనూ కిలాబ్‌కు చెందిన ఆ ఇద్దరు హతుల దీత్ (రక్తపరిహారం) సహాయం కోసం మాట్లాడారు (వీరిద్దరిని హజ్రత్ అమ్రూ బిన్ ఉమయ్యా జమ్రీ పొరపాటున హత్య చేసిన విషయం మనకు తెలుసు). ఒప్పందం ప్రకారం వారు దీనికి సహాయపడవలసి ఉంది. వారు మహాప్రవక్త (స)తో, "ఓ అబుల్ ఖాసిం! సరే, మేము అలానే సహాయపడతాం. మీరు ఇక్కడ కూర్చొని ఉండండి" అని అనగా, దైవప్రవక్త (స) వారి మిద్దె గోడకు ఆనుకొని కూర్చుని వారు తమ వాగ్దానాన్ని పూర్తి చేస్తారనే ఆశతో ఎదురు చూస్తున్నారు. ఆయన (స) వెంట హజ్రత్ అబూ బక్ర్ (ర), హజ్రత్ ఉమర్(ర), హజ్రత్ అలి (ర) ఇంకొందరు సహాబాలు కూడా కూర్చుని ఉన్నారు.

అక్కడ నుండి బయలుదేరి వెళ్ళిన యూదుల బుద్ధివివేకాలను షైతాను ప్రక్కదారికి మళ్ళించాడు. ఏ దురదృష్టం అయితే వారి పాలిట శాపంగా మారనుందో, షైతాను దాన్ని ఎంతో మనోహరమైనదిగా వారికి చూపుతున్నాడు. అంటే అలా వెళ్ళిన ఆ యూదులు పరస్పరం దైవప్రవక్త (స)ను హత్య చేసే కుట్ర పన్నడంలో మునిగిపోయారు. వారు ఓ తిరుగలి (విసుర్రాయి) బండను చూపిస్తూ, "దీన్ని ఎత్తుకొని పైకి వెళ్ళి అక్కడ నుంచి ముహమ్మద్(స) తలపై పడవేయటానికి ఎవరు సిద్ధంగా ఉన్నారు?" అని అడగగా, అందులోని ఓ దురదృష్టవంతుడైన యూదుడు 'అమ్రూ బిన్ హజాష్' నిలబడి "నేను దానికి సిద్ధం" అని అన్నాడు. వారిలోనే ఓ వ్యక్తి సలామ్ బిన్ ముష్కం ఇది గమనించి, "అలా చేయకండి! దైవసాక్షి! వారికి మీరు పన్నే

---

8. *సునన్ అబీ దావూద్-షరహ్ ఔనుల్ మాబూద్-3/116, 117*

https://teluguislam.net



పన్నాగం తెలుపబడుతుంది. ఆ తరువాత మీకూ వారికి మధ్య గల ఒప్పందాన్ని ఉల్లంఘించినట్లవుతుంది, జాగ్రత్త!" అని హెచ్చరించాడు. అయినా వారు అతని మాటలను ఖాతరు చేయలేదు. తమ ఈ పథకాన్ని అమలు చేయడానికి దృఢంగా నిశ్చయించు కున్న తరువాతనే అక్కడ నుండి లేచారు.

అటు అల్లాహ్ తరపున హజ్రత్ జిబ్రీల్ (అ.స.) మహాప్రవక్త (స) వద్దకు వచ్చారు. ఆయన యూదులు పన్నుతున్న కుట్రను గురించి ఆయనకు తెలియ జేశారు. దైవప్రవక్త (స) వెంటనే ఆ ప్రదేశం నుండి లేచి మదీనా వైపునకు బయలుదేరారు. ఆ తరువాత తక్కిన సహాబాలు (ర) కూడా ఆయన వెనుకగా వచ్చి ఆయన్ను కలిశారు. "దైవప్రవక్తా! తమరు అకస్మాత్తుగా అక్కడి నుండి ఎందుకు లేచి వచ్చేసినట్లు?" అని అడిగారు. దానికి సమాధానంగా మహాప్రవక్త (స), యూదుల పన్నాగం గురించి వారికి ఎరుకపరిచారు.

మదీనాకు తిరిగివచ్చిన వెంటనే మహాప్రవక్త (స) ముహమ్మద్ బిన్ ముస్లిమాను బనూ నజీర్ వద్దకు పంపించి, "మీరందరూ మదీనా నుండి బయటకు వెళ్ళిపోండి. ఇక్కడ నాతో ఉండడానికి అర్హులు లేరు, మీకు పది రోజుల గడువు ఇవ్వబడుతోంది. ఆ తరువాత మీలో ఎవరైనా ఇక్కడ కనిపిస్తే అతని మెడను నరకడం జరుగుతుందని" చెప్పించారు. ఈ హెచ్చరిక తరువాత యూదులకు దేశ బహిష్కరణ తప్ప వేరే మార్గం కానరాలేదు. వారు కొన్ని రోజుల వరకు ప్రయాణ సన్నాహాలు చేసుకోనారంభించారు. కాని ఈ సమయంలోనే వంచకుల నాయకుడు అబ్దుల్లా బిన్ ఉబై వారికి, "మీరంతా వెళ్ళడానికి వీల్లేదు. మీ స్థలంలోనే స్థిరంగా ఉండిపోండి. మీరు ఇళ్ళూవాకిళ్ళు వదలడానికి వీల్లేదు. నా దగ్గర రెండు వేల మంది యోధులు ఉన్నారు. వారు మీ కోటలలో ఉంటూ మిమ్మల్ని రక్షించడం కోసం వారు తమ ప్రాణాలనైనా పణంగా పెట్టగలరు. వారే గనక మిమ్మల్ని వెళ్ళగొడితే మీ వెంట దేశ బహిష్కరణకు మేమూ గురి అవుతాము. మీ గురించి ఎవరు ఒత్తిడి తెచ్చినా వినేవారం కాము. మీతోనే యుద్ధం జరిగితే మేము మీ సహాయం కోసం సిద్ధంగా ఉన్నాం. బనూ ఖురైజా మరియు బనూ గత్ఫాన్‌లు కూడా మీకు మిత్రపక్షాలే. వారూ మీకు సహాయపడగలరు" అని చెప్పి పంపించాడు.

కపట ముస్లిమ్ నాయకుడు అబ్దుల్లా బిన్ ఉబై అందించిన ఈ

https://teluguislam.net



సందేశం వల్ల యూదులకు ప్రాణం లేచివచ్చినట్లయింది. దేశ బహిష్కరణకు గురి కావడానికి బదులు ముస్లిములను ఎదుర్కొనేందుకు వారు సిద్ధపడ్డారు. ఆ యూదుల నాయకుడు హుయ్ బిన్ అఖ్తబ్‌కు, అబ్దుల్లా బిన్ ఉబై చేసిన వాగ్దానాన్ని నిలబెట్టుకుంటాడనే ఆశ పొడసూపింది. కాబట్టి అతను దైవప్రవక్త (స) వద్దకు సమాధానంగా, "మేము మా స్వస్థలం నుండి ఏ మాత్రం బయటకు వెళ్ళేది లేదని, చేసేది ఏమిటో చేసుకోమని" చెప్పి పంపించాడు.

ముస్లిములకు ఈ పరిస్థితి అతిగడ్డయిన పరిస్థితి అనడంలో సందేహం ఏమాత్రం లేదు. ఎందుకంటే, వారు తమ చరిత్రలోనే ఈ కీలకమైన మరియు గడ్డు పరిస్థితిలో శత్రువులతో ఢీకొనడం అంటే మాటలు కాదు, పరిణామం బహు ప్రమాదకరంగా ఉంటుంది. అరేబియా దేశం మొత్తమే ముస్లిములకు ఎదురు తిరుగుతున్న రోజులవి. ముస్లిములకు చెందిన రెండు ప్రచార బృందాలు ఎంతో నిర్దయగా చంపివేయబడ్డాయి. అదే కాదు, బనీ నజీర్‌కు చెందిన యూదులు కూడా ఎంతో శక్తిని పుంజుకొని ఉన్నారు. వారు ఆయుధాలను పడవేసి వెళ్ళిపోవడం కూడా జరగని పనిలా అగుపిస్తోంది. వారితో యుద్ధానికి తలపడితే అనేక ప్రమాదాలు ఎదురు కావచ్చు కూడా. కాని బిఇరె మఊనా దుర్ఘటనకు పూర్వం నెలకొన్న పరిస్థితులు చాలా మటుకు మారి పోవడం వలన ముస్లిములు హత్యలు మరియు వాగ్దాన భంగం లాంటి విషయాల్లో ఎంతో జాగరూకతతో మెలగుతున్నారు. ఆ నేరాలు చేసేవారి ఎడల వారి ప్రతీకార భావం రోజురోజుకు పెరిగిపోతూనే ఉంది. అందుకని వారు ఓ నిర్ణయానికి వచ్చారు. బనూ నజీర్ యూదుల తెగ దైవప్రవక్త (స) గారిని హత్య చేయడానికి పన్నాగం పన్నారు కాబట్టి వారితో తప్పకుండా తలపడవలసిందే. పరిణామాలు ఏమైనప్పటికీ వారిని అణచివేయవలసిందే అన్నది ఆ నిర్ణయం. దైవప్రవక్త (స)కు హుయ్ బిన్ అఖ్తబ్ సందేశం అందగానే ఆయన తమ సహాబాలనందరినీ ఓ చోట సమావేశపరచి యుద్ధం చేయడానికే నిర్ణయం తీసుకున్నారు. అల్లాహు అక్బర్ అనే నినాదం చేస్తూ అందరూ లేచి నిలబడ్డారు. హజ్రత్ ఉమ్మె మక్తూమ్ (ర)కు మదీనా సంరక్షణ బాధ్యతను అప్పగించి బనూ నజీర్ నివసిస్తున్న ప్రాంతానికి బయలుదేరారు. హజ్రత్ అలీ బిన్ అబీ తాలిబ్ (ర)గారి చేతిలో యుద్ధ పతాకం రెపరెపలాడుతోంది. వీరు బనూ నజీర్ ప్రాంతానికి చేరి వారిని చుట్టుముట్టేశారు.

https://teluguislam.net



ఇటు బనూ నజీర్ యూదులు తమ కోటల్లో దాక్కొని తలుపులు మూసుకున్నారు. కోట గోడలపై నుండి బాణాలు, రాళ్ళు రువ్వనారంభించారు. వారి కోట చుట్టూ ఉన్న ఖర్జూరపు తోటలు వారిని రక్షిస్తున్నాయి. కాబట్టి మహాప్రవక్త (స) ఆ చెట్లను నరికి కాల్చిపారవేయమని ఆదేశం ఇచ్చారు. ఆ తరువాత హజ్రత్ హస్సాన్ (ర)ను సంబోధిస్తూ ఇలా అన్నారు:

"బనీలవీ సర్దారులకోసం, బవైరా (బనూ నసీర్‌కు చెందిన ఓ ఖర్జూరపు తోట పేరు)లో అగ్ని కీలలు పైకిలేవడం ఓ మామూలు విషయంలా ఉంది."

దీని గురించే అల్లాహ్ ఆదేశం కూడా అవతరించింది.

مَا قَطَعْتُم مِّن لِّينَةٍ أَوْ تَرَكْتُمُوهَا قَائِمَةً عَلَىٰ أُصُولِهَا فَبِإِذْنِ اللَّهِ وَلِيُخْزِيَ الْفَاسِقِينَ ۝

"మీరు ఏ ఖర్జూరపు చెట్లను నరికివేశారో లేక ఏ ఖర్జూరపు చెట్లను వాటి వ్రేళ్ళపై యధాతథంగా ఉండనిచ్చారో, ఇదంతా అల్లాహ్ ఆజ్ఞతోనే జరిగింది. (అల్లాహ్ ఈ ఆజ్ఞను) దుర్మార్గులను అవమానపరిచేందుకు (ఇచ్చాడు)." (59 : 5)

ఎలాగైతేనేమి, వారిని చుట్టుముట్టిన తరువాత బనూ ఖురైజా తెగ ఇందులో తలదూర్చకుండా మిన్నకుండిపోయింది. అబ్దుల్లా బిన్ ఉబై జాడే లేదు. అతను యూదులను మోసగించాడు. వారి మిత్రపక్షం అయిన గత్ఫాన్ కూడా వారి సహాయం కోసం రాలేదు. మొత్తానికి ఏ ఒక్కడూ వారిని ఆదుకోడానికిగాని, వారి కష్టాలను కడతేర్చడానికిగాని ముందుకురాలేదు. అల్లాహ్ ఈ పరిస్థితిని ఈ ఉపమానం ద్వారా ఇలా సెలవిచ్చాడు:

كَمَثَلِ الشَّيْطَانِ إِذْ قَالَ لِلْإِنسَانِ اكْفُرْ فَلَمَّا كَفَرَ قَالَ إِنِّي بَرِيءٌ مِّنكَ

"వీరి దృష్టాంతం షైతాన్ దృష్టాంతం మాదిరిగా ఉంది; ప్రారంభంలో వాడు మానవునితో, 'సత్యాన్ని తిరస్కరించు' అని అంటాడు. తీరా మానవుడు సత్యాన్ని తిరస్కరిస్తే, వాడు, 'నీ పట్ల నాకు ఏ విధమైన బాధ్యతా లేదు. సకల లోకాల ప్రభువు అయిన అల్లాహ్ అంటే నాకు భయం' అని అంటాడు." (59 : 16)

https://teluguislam.net



ఆ దిగ్బంధం ఎన్నో రోజులు కొనసాగలేదు. కేవలం ఆరు రాత్రులు- మరో ఉల్లేఖనం ప్రకారం, పదిహేను రాత్రులు- మాత్రమే కొనసాగింది. అల్లాహ్ వారి హృదయాల్లో భయాన్ని ముస్లిముల ఎడల అఘోరాన్ని పుట్టించాడు. వారి ధైర్యం పటాపంచలైపోయింది. విధిలేక ఆయుధాలు పడవేయడానికి సిద్ధపడ్డారు. దైవప్రవక్త (స)కు ఓ సందేశం పంపిస్తూ, "మేము మదీనాను విడిచి వెళ్ళడానికి సిద్ధంగా ఉన్నాము, తమరు ప్రతిపాదించిన దేశ బహిష్కారాన్ని మేము శిరసావహిస్తున్నాము" అని చెప్పారు. మహాప్రవక్త (స), వారి ఈ ప్రతిపాదనను మంజూరు చేస్తూ, మీ ఆయుధాలు తప్ప మీ సొత్తునంతా ఒంటెలపై వేసుకొని మీ భార్యాపిల్లలతో సహా మదీనాను విడిచి వెళ్ళండని ఆదేశించారు.

దైవప్రవక్త (స) ఇచ్చిన ఈ ఆదేశం మేరకు వారు తమ ఆయుధాలను పడవేసి, తమ చేతులతోనే తమ ఇండ్లను పడగొట్టి కిటికీలు ద్వారబంధాలతో, చివరికి గోడలోని మేకులతో సహా ఒంటెలపై వేసుకొని కట్టుకున్నారు. ఆ తరువాత తమ భార్యాబిడ్డలను ఎక్కించుకొని ఆరు వందల ఒంటెలపై మదీనాను విడిచి వెళ్ళిపోయారు. వారిలో చాలా మంది యూదులు, వారి సర్దారులు హుయ్ బిన్ అఖ్తబ్ మరియు సలాం బిన్ అబిల్ హుఖైఖ్‌తో సహా ఖైబర్ దారిపట్టారు. వారిలోని ఓ బృందం సిరియా వైపునకు వెళ్ళిపోయింది. కేవలం ఇద్దరు వ్యక్తులు అంటే యామీన్ బిన్ అమ్రూ మరియు అబూ సయీద్ బిన్ వహబ్‌లు మాత్రమే ఇస్లామ్ స్వీకరించి మదీనాలో ఉండిపోయారు. వారి ఆస్తులను ఏమాత్రం ముట్టుకోవడం జరగలేదు.

మహాప్రవక్త (స) బనూ నజీర్‌కు చెందిన ఆయుధాలు, భూములు, ఇళ్ళు మరియు తోటలను తన ఆధీనంలో ఉంచుకున్నారు. ఆయుధాల్లో యాభై కవచాలు, యాభై శిరస్త్రాణాలు, మూడు వందల నలభై ఖడ్గాలు ఉన్నాయి.

బనూ నజీర్‌కు చెందిన తోటలు, భూములు మరియు ఇళ్ళపై హక్కు కేవలం దైవప్రవక్త (స) గారిదే. వాటిని తామే ఉంచుకునే లేదా ఇతరులకు పంచిపెట్టే అధికారం ఆయనకే ఉంది. కాబట్టి ఆయన(స), (యుద్ధ ధనంలా) ఈ సంపద నుండి 'ఖుమ్స్' (అయిదో వంతు) తీయలేదు. ఎందుకంటే అల్లాహ్ ఆయనకు ఈ ధన సంపద 'ఫై' ధనంగా బహూకరించినది. ఎందుకంటే ఈ సంపదను పొందడానికి ముస్లిములు గుర్రాలను, ఒంటెలను పరుగుదీయించి

https://teluguislam.net



దాన్ని (ఖడ్గబలంతో) జయించలేదు గనుక. మహాప్రవక్త (స) తన ప్రత్యేక అధికారాన్ని ఉపయోగించి ఈ ధన సంపదను ప్రథమంగా హిజ్రత్ చేసి వచ్చిన ముహాజిర్లకు పంచిపెట్టారు. అయితే ఇద్దరు అన్సారులకు చెందిన సహాబా (ర) అంటే హజ్రత్ అబూ దుజానా (ర) మరియు సహల్ బిన్ హునైఫ్ (ర)లకు వారి దారిద్ర్య జీవితాన్ని చూసి అందులో నుంచి కొంత ఇచ్చారు. అదే కాకుండా ఆయన (స) కొంత భూభాగాన్ని తన కోసం ఉంచుకున్నారు. దీని ద్వారా ఆయన (స) తనకు, తన భార్యామణులకు కావలసిన వార్షిక బత్తెం అందుండే వచ్చేది. అందులో మిగిలినదంతా జిహాద్ కోసం, గుర్రాల కొనుగోలు కోసం ఖర్చుపెట్టేవారు.

గజ్వయె బనూ నజీర్, రబీఉల్ అవ్వల్ మాసం హి.శ. 4 అంటే క్రీ.శ. 625, ఆగస్టు మాసంలో సంభవించింది. అల్లాహ్ దానికి సంబంధించి పూర్తి ఒక సూరా, 'సూరయె హష్ర్'నే అవతరింపజేశాడు. అందు యూదుల దేశ బహిష్కరణను వివరిస్తూ, వంచకుల వైఖరిని కూడా బట్టబయలు చేయడం జరిగింది. అందులోనే 'ఫై' ధనం గురించిన ఆదేశాలు జారీ చేస్తూ, ముహాజిర్లు మరియు అన్సారులను పొగడడం జరిగింది. అదే కాకుండా యుద్ధవ్యూహం ప్రకారం శత్రువుల చెట్లను కూడా నరకవచ్చని, వాటిని కాల్చవచ్చనే అనుమతి కూడా ఇవ్వడం జరిగింది. ఇలా చేయడం భూమిలో సంక్షోభాన్ని లేవనెత్తడం కాదు అని చెప్పడం జరిగింది. ఆ తరువాత ముస్లిములను, దైవభీతిని అవలంబిస్తూ పరలోక జీవితం గురించి సిద్ధపడవలసిందిగా తాకీదు చేయడం జరిగింది. చివరిగా అల్లాహ్ స్తోత్రాలతో తన నామాలను, సుగుణాలను చెబుతూ ఆ అధ్యాయాన్ని ముగించాడు.

ఇబ్నె అబ్బాస్ (ర) ఈ అధ్యాయం (హష్ర్ సూరా) ప్రస్తావన వచ్చినప్పుడల్లా, దీన్ని 'సూరయె బనీయిన్నజీర్' అనండి" అనేవారు.[9]

## 6. గజ్వయె నజద్

బనీ నజీర్ పోరాటంలో ఎలాంటి త్యాగాలు చేయకుండానే ముస్లిములు విజయాన్ని సాధించగలిగారు. దీనివల్ల మదీనాలో నెలకొన్న ఇస్లామీయ అధికారం మరింత దృఢపడింది. వంచకులు నిరాశకు గురైపోయారు.

---

*9. ఇబ్నె హష్షామ్-2/190, 191, 192; జాదుల్ ముఆద్-2/71, 110; సహీ బుఖారి-2/574, 575*

https://teluguislam.net



ఇప్పుడు వారికి బహిరంగంగా ఏ పనీ చేసే ధైర్యమూ లేదు. ఈ పోరాటం అనంతరం దైవప్రవక్త (స)కు బద్దూలను అణచివేయడానికి దృష్టిని కేంద్రీకరించే అవకాశం లభించింది. ఈ బద్దూలు ఉహద్ పోరాటం జరిగిన వెంటనే ముస్లిములను అనేక కడగండ్లకు గురి చేశారు. ఎంతో పాశవికంగా ఇస్లామ్ ధర్మానుయాయులపై దాడులు చేసి వారిని చంపేశారు. ప్రస్తుతం వారి ధైర్యం మరింత హెచ్చి మదీనాపై దాడి చేయడానికి సంసిద్ధులవుతున్నారు.

బనూ నజీర్ పోరాటం ముగించుకొని దైవప్రవక్త (స), ఈ బద్దూలను అణచడానికి సిద్ధమయ్యారో లేదో, బనీ గత్ఫాన్‌కు చెందిన రెండు తెగలు బనూ ముహారిబ్ మరియు బనూ సఅలబాలు కలసి బద్దూలు మరియు అరాబీలను కూడగట్టుకొని మదీనాపై దాడి చేయాలని చూస్తున్నారన్న వార్త దైవప్రవక్త (స)కు అందింది. ఈ వార్త అందగానే మహాప్రవక్త (స), నజద్‌పై దాడి చేసే నిర్ణయం గైకొన్నారు. నజద్ ఎడారిలో చాలా దూరం వరకు చొచ్చుకొని వెళ్లిపోయారు. దీని లక్ష్యం, ఆ కఠిన హృదయులైన బద్దూలను భయభీతులుగా చేయాలని, తిరిగి వారికి ముస్లిములకు వ్యతిరేకంగా ఇదివరకటి తీవ్రమైన చర్యలు గైకొనే ధైర్యం లేకుండా చేయాలన్నదే.

ఇటు తలబిరుసుగల బద్దూలు, దోపిడీలకు, హత్యలకు సమాయత్తమవుతూ ఉండగానే, ముస్లిములు హఠాత్తుగా వారిపై విరుచుకుపడుతున్నారనే వార్త అందింది. భయకంపితులై పారిపోయి పర్వతాల శిఖరాలపై దాగి కూర్చున్నారు. ముస్లిములు ఈ దోపిడీగాళ్ళ తెగలపై తమ భయాన్ని ఆవహింపజేసి ప్రశాంతంగా మదీనాకు తిరిగివచ్చేశారు.

సీరత్ చరిత్రకారులు, రబీ ఉల్ ఉఖ్రా లేదా జమాదిల్ ఊలా మాసాలు హి.శ. 4 లో నజద్ ప్రాంతంలో జరిగిన ఓ గజ్వా గురించి ప్రత్యేకంగా చెబుతారు. ఆ గజ్వా గజ్వయె జాతుర్రిఖాఖ్ అని వారి వాదన. ఆధారాల ప్రకారం, ఆ రోజుల్లో నజద్ ప్రాంతంలో ఓ గజ్వా చోటుచేసుకొన్న విషయం యదార్థం. ఎందుకంటే మదీనా పరిస్థితులే అప్పుడు అలా ఉన్నాయి మరి. అబూ సుఫ్యాన్ ఉహద్ యుద్ధం నుండి వెళ్ళిపోతూ మరుసటి సంవత్సరం బద్ర్ మైదానంలో మరో యుద్ధం కోసం సవాలు విసిరాడు. ఆ సవాలును ముస్లిములు స్వీకరించారు కూడా. ఇప్పుడు ఆ సమయం దాపురిస్తూ ఉంది. యుద్ధవ్యూహం దృష్ట్యా, బద్దూలు మరియు అరాబీల పీచమణచకుండా బద్ర్ లాంటి మహా సంగ్రామంలో పాల్గొనడానికి మదీనాను ఖాళీ చేసి వెళ్ళడం

https://teluguislam.net



సరైనది కాదు. బద్ర్ యుద్ధం లాంటి మరో యుద్ధంలో పాల్గొనే ముందు ఈ బద్దూల పీచమణచి వారిని మదీనా వైపునకు రాకుండా చేయడం కూడా ఒక వ్యూహమే అనాలి.

ఇక మిగిలింది, రబీ ఉల్ ఉఖ్రా మరియు జమాదిల్ ఊలా మాసాల్లో (హి.శ. 4) సంభవించినది ఈ గజ్వాయే, గజ్వాయె జాతుర్రిఖాఖ్ అన్నది మా పరిశోధన ప్రకారం సరైనది కాదు. ఎందుకంటే హజ్రత్ అబూ హురైరా (ర) ఖైబర్ యుద్ధానికి కొన్ని రోజులకు పూర్వమే ఇస్లామ్ స్వీకరించారు. అలాగే అబూ మూసా అష్అరీ (ర) కూడా ముస్లిమై యమన్ నుండి బయలుదేరి వచ్చారు. ఆయన వచ్చి దైవప్రవక్త (స)ను కలసినది ఖైబర్‌లోనే. కాబట్టి గజ్వాయె జాతుర్రిఖాఖ్, గజ్వాయె ఖైబర్ తరువాత సంభవించిన పోరాటం కావచ్చు.

హిజ్రీ శకం 4 తరువాత కొంతకాలానికి గజ్వాయె జాతుర్రిఖాఖ్ సంభవించినదన్న దానికి ఓ ఆధారం, దైవప్రవక్త (స) ఆ యుద్ధంలో సలాతుల్ ఖౌఫ్ చేయడం.[10]

సలాతె ఖౌఫ్ మొట్టమొదటగా గజ్వాయె బనూ అస్ఫాన్‌లో చేయడం జరిగింది. గజ్వాయె అస్ఫాన్, గజ్వాయె ఖందఖ్ తరువాత జరిగిన పోరాటం అనడంలో ఎవరికీ భేదాభిప్రాయం లేదు. గజ్వాయె ఖందఖ్ కాలం హిజ్రీ శకం 5కు సంబంధించినది. గజ్వాయె అస్ఫాన్ హుదైబియా ప్రయాణానికి సంబంధించిన ఓ సంఘటన. హుదైబియా ప్రయాణం హిజ్రీ శకం 6 చివరి కాలంలో జరిగింది. ఆ ప్రయాణం నుండి తిరిగివచ్చి మహాప్రవక్త (స) ఖైబర్ వైపునకు బయలుదేరారు. దీని ప్రకారం, గజ్వాయె జాతుర్రిఖాఖ్ సంభవించిన కాలం ఖైబర్ తరువాత సంభవించిన కాలమని రుజువు అవుతోంది.

## 7. రెండో బద్ర్ పోరాటం

బద్దూలను అణచేసి, వారు ఇక ముస్లిములకు నష్టం చేకూర్చలేరనే

---

10. యుద్ధంలో చేసే నమాజును సలాతుల్ ఖౌఫ్ అంటారు. ఈ నమాజు చేసే విధానం ఏమిటంటే, సగం సైన్యం ఆయుధధారి అయి ఇమామ్ వెనుక నిలబడి నమాజు చేయాలి. తక్కిన సగం సైన్యం ఆయుధాలు ధరించి శత్రువును కనిపెట్టు కొని ఉండాలి. ఒక రకాత్ అయిన తరువాత ఈ సైన్యం ఇమామ్ వెనుకకు వచ్చేయాలి. మొదటి సైన్యం తిరిగి వెళ్ళి శత్రువును కనిపెట్టుకొని ఉండాలి. ఇమామ్ తన నమాజు రెండవ రకాత్ పూర్తి చేసిన తరువాత సైన్యం తమ తమ రకాత్‌లను ఇదివరిలా పూర్తి చేసుకోవాలి. ఇలాంటి నమాజ్‌కు సంబంధించినవి ఇలాంటివే మరికొన్ని విధానాలు ఉన్నాయి. అవి హదీసు గ్రంథాల్లో లభిస్తాయి.

https://teluguislam.net



స్థిమితం ఏర్పడిన తరువాత ముస్లిములు తమ పెద్ద శత్రువు (ఖురైష్)తో యుద్ధం చేయడానికి సంసిద్ధులై ఉన్నారు. సంవత్సరం పూర్తికావస్తోంది. ఉహద్ యుద్ధ సమయంలో ఖురైష్ విసిరిన సవాలు కాలం దగ్గరబడుతోంది. ముహమ్మద్ (స) మరియు ఆయన అనుచరులు యుద్ధరంగంలో అబూ సుఫ్యాన్ మరియు అతని జాతితో బాహాబాహీ చేసే సమయం ఆసన్నమవు తోంది. జరగబోయే ఈ యుద్ధం పూర్తిగా ముస్లిముల మనుగడకు మార్గం చూపేదై, ఇస్లామ్ ధర్మాన్ని వ్యాపింపజేసేదై ఉండాలని ఓ నిర్ణయాత్మకమైన రీతిలో యుద్ధం కోసం సంసిద్ధులవుతున్నారు ముస్లిములు.

హి.శ. 4, షాబాన్ నెల (క్రీ.శ. 626, జనవరి)లో మదీనా బాధ్యతను హజ్రత్ అబ్దుల్లా బిన్ రవాహా (ర)కు అప్పగించి ఈ నిర్ణయించబడిన యుద్ధం కోసం బద్ర్ వైపునకు బయలుదేరారు ప్రవక్త శ్రీ (స). ఆయన వెంట పదిహేను వందల మంది సైనికులు, పది గుర్రాలున్నాయి. యుద్ధ పతాకాన్ని హజ్రత్ అలీ (ర) గారికి ఇవ్వడం జరిగింది. బద్ర్ ప్రదేశానికి వెళ్ళి ముష్రిక్కుల రాక కోసం ఎదురు చూడనారంభించారు వీరు.

మరోవంక అబూ సుఫ్యాన్ యాభై మంది అశ్వికదళంతో, రెండు వేల మంది ముష్రిక్కుల సైన్యాన్ని తీసుకొని బయలుదేరాడు. మక్కాకు ఓ మజిలీ దూరాన ఉన్న మర్రఉజ్జహ్రాన్ చేరి మజిన్నా పేరుగల ప్రఖ్యాత ఊటబావి వద్ద విడిది చేశాడు. అయితే అతను మక్కా నుండి బయలుదేరడమే అయిష్టంగా బయలుదేరాడు. అతను మాటిమాటికి ముస్లిములతో జరగ బోయే యుద్ధాన్ని తలుచుకుంటూ దాని పరిణామం ఎలా బయటపడు తుందో అనేది జ్ఞప్తికి రాగానే భయకంపితుడవుతున్నాడు. మర్ర ఉజ్జహ్రాన్‌కు చేరిన వెంటనే అతని ధైర్యం దెబ్బతిన్నది. వెనక్కు మళ్ళడం ఎలా? అనే ఆలోచనలో పడిపోయాడు. చివరికి అతను తన వారిని సంబో ధిస్తూ, "మిత్రులారా! యుద్ధం అనేది పచ్చిక రోజుల్లో జరిగితేనే మంచిది. మన పశువులూ మేతమేయగలవు, మనము పాలూ త్రాగగలం. కాని ఇప్పుడు చూడండి అంతటా కరువు తాండవిస్తోంది. కాబట్టి నేను వెనక్కు మళ్ళిపో తున్నాను. మీరు కూడా వెనక్కు మళ్ళండి" అన్నాడు.

ఆ సేన మొత్తం మీదనే భయభీతులు ఆవహించాయా అన్నట్లు ఉంది. అబూ సుఫ్యాన్ ఇచ్చిన సలహాను ఎవరూ కాదనలేకపోయారు. అందరూ తిరుగు ముఖం పట్టి వెళ్ళిపోతున్నారు.

https://teluguislam.net



ఇటు ముస్లిములు బద్ర్ మైదానంలో ఎనిమిది రోజుల వరకు నిరీక్షించారు. ఈలోపు వారు తాము తెచ్చుకున్న సామగ్రిని అమ్మి డబ్బు బాగా గడించారు. వారందరూ విజేతలై తిరిగివచ్చినట్లుగా మదీనా చేరు కున్నారు. ముష్రిక్కుల హృదయాలు వారి భయం వల్ల గడగడలాడుతూ ఉండగా, వాతావరణం అంతా వారికి అనుకూలంగా మారినట్లుగా వారు మదీనాకు తిరిగి వచ్చారు. ఈ గజ్వాను "గజ్వయె బద్రె మౌఇద్‌గా, బద్రె సానియాగా, బద్రె అఖిరాగా మరియు బద్రె సుగ్రాగా" కూడా పిలుస్తారు.[11]

## గజ్వయె దూమతుల్ జందల్ (దూమతుల్ జందల్ పోరాటం)

దైవప్రవక్త (స) గజ్వయె బద్రెసాని (రెండవ బద్ర్ యుద్ధం) ముగించు కొని మదీనాకు వచ్చేశారు. మదీనాలో ఎల్లెడల శాంతి వాతావరణం నెలకొని ఉంది. పూర్తి ఇస్లామీయ సామ్రాజ్యంలో ఓ విధమైన స్థిమితం ఏర్పడింది. ఇప్పుడు మహాప్రవక్త (స)కు అరేబియా చివరి సరిహద్దుల వైపు దృష్టిని సారించే అవకాశం లభించింది. అలా చేయడం కూడా అవసరమే మరి. ఎందుకంటే, పరిస్థితులపై ముస్లిములకు అదుపు ఉండాలి మరియు మిత్రులు, శత్రువులు దీన్ని గమనించవలసిన తరుణం కాబట్టి.

ఈ గజ్వా తరువాత ఆరు నెలల వరకు ఎలాంటి చీకూచింతా లేకుండా మహాప్రవక్త (స) మదీనాలో గడిపారు. ఆ తరువాత సిరియా దాపున దూమతుల్ జందల్ అనే ప్రదేశం చుట్టుపట్ల నివసిస్తున్న తెగలు, వచ్చిపోయే బిడారాలను దోచుకుంటున్నాయనీ ఆ మార్గాన వెళ్ళే వారి సామగ్రినంతా దోచుకుంటు న్నాయనే వార్త మహాప్రవక్త (స)కు అందింది. అంతేకాదు, వారు మదీనాపై దండెత్తడానికి ఓ పెద్ద సైన్యాన్ని కూడా సమీకరిస్తున్నారనీ తెలిసింది. ఈ వార్తల దృష్ట్యా మహాప్రవక్త (స), సబా బిన్ అరఫ్తా గఫ్ఫారీ (ర)కు మదీనా బాధ్యతలను అప్పగించి ఒక వేయి మంది ముస్లిమ్ యోధులతో వారిని అణచడానికి బయలుదేరారు. ఇది రబీఉల్ అవ్వల్ మాసం, హిజ్రీ శకం 5కు సంబంధించిన సంఘటన. దారి చూపడానికి 'మజ్‌కూర్' పేరుగల ఓ వ్యక్తిని వెంటబెట్టుకొని వెళ్ళడం జరిగింది.

---

*11. ఈ గజ్వా వివరాల కోసం చూడండి, ఇబ్నె హష్షామ్-2/209,210; జాదుల్ ముఆద్-2/112*

https://teluguislam.net



ఈ గజ్వా సందర్భంలో మహాప్రవక్త (స) రాత్రి పూట ప్రయాణం చేస్తూ శత్రువుపై హఠాత్తుగా దాడి చేయడానికిగాను పగలు ఎవరికీ అగుపడకుండా దాగి ఉండేవారు. తీరా దగ్గరికి వెళ్ళిన తరువాత వారంతా పారిపోయారని తెలిసింది. అందుకని ఆయన సేన వారి పశువులు, పశువుల కాపరులపై దాడి చేసేసింది. వారిలో కొందరు ఆయనకు చిక్కారు కూడా. మరికొందరు పారిపోయారు.

ఇక దూమతుల్ జందల్‌లో నివసిస్తున్న వారి విషయానికొస్తే, వారంతా ఎటూ దిక్కుతోచక పారిపోవలసి వచ్చింది. దూమతుల్ జందల్‌కు చేరినప్పుడు ముస్లిములకు ఎవరూ పట్టుబడలేదు. మహాప్రవక్త (స) అక్కడ కొన్ని రోజులు గడిపి మదీనాకు తిరిగివచ్చేశారు. ఈ గజ్వా సందర్భంగానే యుయైనా బిన్ హసన్‌తో సంధి కూడా కుదుర్చుకోవడం జరిగింది. (దూమతుల్ జందల్, సిరియా సరిహద్దులోని ఓ పట్టణం. ఇక్కడి నుండి డెమాస్కస్ అయిదు రాత్రుల ప్రయాణ దూరంలోనూ, మదీనా పదిహేను రాత్రుల ప్రయాణ దూరంలోనూ ఉంది.)

హఠాత్తుగా తీసుకుంటున్న ఈ నిర్ణయాలు, వివేచనతో కూడిన ఈ చర్యల ద్వారా మహాప్రవక్త (స), ఇస్లామీయ సామ్రాజ్యంలో శాంతి భద్రతలను నెలకొల్పడంలో, పరిస్థితులను అదుపులోనికి తేవడంలోనూ కృతకృత్యు లయ్యారు. ఆయన ఆ పరిస్థితిని ముస్లిములకు అనుకూలంగా మలుచుకొని తమను ఎల్లవేళల చికాకుపరిచే మదీనా అంతర్గత విరోధుల వల్ల మరియు వెలుపలి నుండి వచ్చిపడే కష్టాలను తగ్గించడంలో విజయం సాధించినట్లయింది. మహాప్రవక్త (స) అనుసరిస్తున్న ఈ వ్యూహాల వల్ల వంచకులు ఎటూ పాలుపోకుండా మిన్నకుండిపోయారు. యూదులకు చెందిన ఓ తెగ దేశ బహిష్కరణకు గురి అయిపోయింది. ఇతర తెగలు కూడా ముస్లిములతో సత్సంబంధాలు పెట్టుకునేందుకు వివశులైపోయారు. బద్దూలు మరియు మక్కా ఖురైష్‌ల బలం సన్నగిల్లిపోయింది. ఇలా ముస్లిములకు, ఇస్లామ్ ధర్మ ప్రచారం చేయడానికి, సృష్టికర్త అందించిన సందేశాన్ని అరేబియాలో వ్యాపింపజేయడానికి అవకాశాలు లభించాయి.